# ఏడుకొండలవాడా!

"ఏం నాయనా — దాంతో వారం రోజులనుంచీ చెప్తున్నాను, వినకుండా వుంది. రేపు శనివారం మంచిది" అంది పులుసు వడ్డిస్తూ అమ్మ.

"దేనికండీ?" అన్నారు ఆయన.

"దేని కేమిటోయ్ — ఏదో ఏడుకొండల వాణ్ణి దర్శించుకుని, ఆ మొక్కు కాస్తా తీర్చుకుని వచ్చామా, నాకు మనశ్శాంతిగా వుంటుంది" అంది అమ్మ.

"చూశారా — రోజూ మీ చెవులో వెంకటరమణున్ని గురించి నూరిపోస్తున్నా— నా మాట వినిపించుకోరు. పైగా అమ్మ నేను చెప్పలేదని నెపం వేస్తుంది" అన్నాను వారివంక తిరిగి.

"నువ్వు చెప్పలేదని అన్నానా?" అన్నారు.

"నే చెబితే యేం — అది చెపితే యేం— ఎవరు చెపితే ఏముంది గాని ఆదివారం నీకెలాగా శెలవరోజు; ఒక్క శనివారం నాకోసం కాస్త శెలవుబెట్టు నాయనా. ఆరేళ్ళక్రితం మొక్కుకున్నాను. ఆ ఏడు కొండలవాడి ధర్మమా అని మళ్ళీ నలుగుర్లో పడ్డావు."

"శెలవ దొరుకుతుందో లేదోనండి"—

"ఆ మాట అంటావని, శని ఆదివారాలు కలిసివచ్చేట్టు ప్రయాణం పెట్టుకున్నాము. పూర్వయాత్ర వాళ్ళందరూ దిగితే, నేను స్టేషనులో వుండిపోయాను, స్వామి కొండ ఎక్కలేదు; మీ యిద్దర్నీ తీసుకుని ఎక్కుతానని మొక్కుకున్నానాయెను. ఏదో వాడి దయ. నువ్వు మళ్ళీ మామూలు మనిషిలా రెండు కాళ్ళమీద నడుస్తున్నావ్. అంతే చాలు."

"ఇప్పుడెందుకులెండి యింకోసారి చూసుకుందాం."

"నువ్వు అల్లా అంటే ఎలా బాబూ — తిరుపతికొండ ఎక్కి స్వామి మొక్కుబళ్లు తీర్చింతరువాత, నేను గంగ సంతర్పణా, కాలభైరవుడి సంతర్పణా చేసుకోవాలి. మా బాబువి కదూ, యీ వొక్కసారికి నా మాట వినవోయ్. నాతో యాత్రల కెళ్లిన వాళ్లు అన్ని సంతర్పణలూ ముగించుకున్నారు. కాస్త శెలవుబెట్టు నాయనా."

"ఈ నెలలో నాకు డబ్బు సద్దుపాటు కాదండీ, వచ్చే నెలలో వెళ్దాం."

"అల్లా కాదోయ్. నీ కాలికి దెబ్బ దగిలి పక్కమీద వున్నప్పుడు, నీ కాలు సరి అయితే బంగారు కాలు స్వామికి, మీ యిద్దర్నీ తీసుకెళ్లి, అర్పించుకుంటానని మొక్కుకున్నాను. ఈ ప్రయాణానికి అయే డబ్బుగురించి నువ్వు జోక్యం కలిగించుకోకూడదు. ఎల్లాగో అల్లాగు ఎల్లుండికి ప్రయాణం అయేట్టు చూడు..."

"చూద్దాంలెండి."

"చూద్దాం అంటే ఎల్లా? ఏదో పెద్ద దాన్ని నా కోర్కె కాస్త చెల్లించవోయ్—"

"ఏవే అమ్మా — నాకు మాంగాయిమాల చేయించకపోతే నేను తిరపతి రాను. మీ అల్లుణ్ణి మంచిమాట ఆడుతున్నావు గాని నా సంగతి కూడా ఆలోచించు." అన్నాను పెరుగూ అన్నం కలుపుతూ.



"ఏవిటి సుందరీ, చంటిపిల్లలా ఆవేడని అలా వేపుకుతింటావ్" అన్నారు కేక లేస్తున్నట్టు.

"పోనీలే నాయనా - అదిమటుకు ఎవరిని అడుగుతుంది."

"అదికాదండీ..."

"కాదండీ లేదు -అవునండీ లేదు. మీకు బంగారపుకాలు చేయించేందుకు డబ్బుంది కాని, నాకు మాంగాయిమాలకొనేందుకు డబ్బు లేదట. అవున్లే."

"ఫూ - కానీ కలకంఠికంటె కన్నీరు"

"ఛీ పొండి-" అని అన్నందగ్గిరనుంచి లేస్తున్న నన్ను చూసి అమ్మ : "అదేమిటే పెరుగు వదిలేశావ్ - నీకు మామిడిపిందెల మాల తిరపతినుంచి రాంగానే కొంటాగా- ఆ కాస్త అన్నం తినవే." అంది.

"ఏవి చిరునవ్వులూ, దరహాసచంద్రికలూ" అన్నారు చిలిపిగా.



నేను మాట్లాడలేదు.

* * *

తమలపాకుల చిలకలూ, వక్కపొడి చేతుల్లో పెడుతుంటే "అయితే అమ్మగారి మాటలో నాక్కూడా కొంతభాగంవుంది కదూ." అన్నారు కొన బుగ్గల్ని వేళ్ళతో తాకుతూ.

"మీకు బంగారుకాలు చేయించడం లేదూ. అందులో కాలు పొడగరి వారాయెను. మామూలువాళ్లకంటె రెండు రెట్లు బంగారం కావాలి తెలుసా?"

"కాళ్లు చేయించినా, తులాభారం వేయించినా బీబినాంచారమ్మ యింటాయనకేగా సదరుబంగారం చెందడం. కాస్త కమీషనన్నా యివ్వరాయెను నాకు..."

"అమ్మాయ్ యిల్లారా" అన్న అమ్మ కేకతో లోపలికి వెళ్లి, మళ్ళీ హాలులోకి వచ్చాను. వారి జేబులో నూరురూపాయల నోటు పెడ్తూ "ఎల్లుండికి టికట్లూ అవీ తెండి" అన్నాను.

"చిత్తం. యీ భృత్యుడి కోర్కె."

"చూద్దాం!"

"చూద్దాం అంటే వల్లగాదు. మీఅమ్మ యిచ్చేమాట, నువ్వూ వంగనా మాల వాడూ పంచుకు కూచుంటే - మరి యీ భిక్షుడిమాటో..."

"ఏం - మీకు మోటరుసైకిలు కొనక పోతే ఏడుకొండలూ ఎక్కరా? సరాసరి కొండమీదకు కార్లున్నాయండి."

"రానని అంటంలేదు. కూచోబెట్టి బంగారుతొడుగు తొడుగుతానంటే వద్దంటానా - మహారాజులా వస్తాను. పోనీ తులాభారం వేయమను. పూర్వం సత్యభామ వేసిందట. యీ కలికాలంలో ఆగాఖాన్కే అలాంటిఅదృష్టం పట్టింది. నన్నుగూడా రూపాయలతో తూస్తే అభ్యంతరంలేదు."

"పోదురూ-మీహాస్యాలూమీరూనూ!"

"వెళ్తున్నా కాస్తవీడి కోర్కె మీ అమ్మ దగ్గిరకు హంససందేశంలా తీసుకెళ్లడం మర్చిపోకూ." అన్నారు గాలిలోకి ముద్దు విసురుతూ.

... ... ... ...

ఆరాత్రి భోంచేస్తూంటే - అమ్మతో "మీరేదో బంగారుకాలు అని అంటున్నారు. తలకిమించిన ఖర్చవుతుందేమో-" అన్నారు ఆయన.

"అదేమిటోయ్ అల్లా అంటావు. స్వామికి మొక్కుకున్నతర్వాత డబ్బు కోసం ఆలోచిస్తామా. అపరాధం నాయనా-" అంది అమ్మ లెంపలు వేసుకుంటూ.




"అయితే కొాలు ఇక్కడే చేయించి తీసుకెళ్తారా?"

"అక్కర్లేదు. అక్కడే అమ్ముతారు"

"మరి సైజో..."

"అన్ని సైజులూ అక్కడే అమ్ముతారు"

"యిల్లా ఎంతబంగారం దోచుకొంటున్నారో - అందుకే గవర్నమెంటు దేవస్థానాన్ని వశం చేసుకున్నారు."

"మానాయన కాదూ, పొరపాటుమాటలనియ్యకు. నువ్వొచ్చిరైలులో కూచోటమే మిగతా వన్నీ నేను సర్దుకుంటాను. టికట్లు తెచ్చావా."

"ఆ-శనివారం పొద్దుట ఎక్స్‌ప్రెస్‌కి తెచ్చాను."

"సరే బాబూ. స్వామిని దర్శించుకొచ్చానా - నా మనస్సు తేలిక అవుతుంది." అంది పెరుగు వడ్డిస్తూ అమ్మ.

* * *

"ఇంకా అయిదు నిమిషాలే టైముంది. మీరు ముందు ఎక్కండి. నేను సామాను సర్దిస్తాను." అంటూ నన్నూ అమ్మనీ కంపార్టుమెంటువద్ద వదలి, కూలీవద్దకు గబగబా నడిచారు.

కంపార్టుమెంటులో - ఒక పక్క సీటులో భార్యాభర్త, నలుగురు పిల్లలూ కూచున్నారు. ఎదురుగా సీట్లో యిద్దరు మొగవాళ్లు పేపర్లో తలలు దూర్చుకుని కూచున్నారు. కూచునేందుకు స్థలంకోసం యిటూ, అటూ చూసి తలుపుదగ్గిరే నిల్చుండిపోయాము. కూలికి డబ్బిచ్చి తలుపు మూసి నాలుగు మూలలా పరకాయించి చూశారు వారు. రైలు కదిలింది.

భార్యాభర్తల్లో, భర్త లేచి యిద్దరి పిల్లల్ని తీసుకుని ఎదరు సీట్లో కూచుని: "రాండి — అమ్మా — రాండి. ఆండవాళ్లు, నిల్చుకోకండి - రాండి. ఆతట్టు కూచుకోండి" అన్నాడు బంగారపు పళ్లు బయట పెడుతూ. కూచున్నాము.

వారు చుట్టూ నిస్సహాయంగా చూసి తలుపుకు జారబడి నిల్చుని బ్లిడ్జి విప్పారు.

ఎదుటి బంగారుపళ్లాయన, "పడుచువాడివిదానె — కొంచెం సేరం నిల్చుకోమీ - యిందఆసామిలు తిరువళ్లూరు పూడుస్తారు. అంతదాకా నిల్చుకోమీ" అన్నాడు పక్కన పేపర్లో తలదాచుకున్న వాళ్లను చూపించి.

మావారు కోపంగా తలెత్తారు. స్నేహార్ద్రమయిన ఆ నవ్వూ, అమాయకంగా చూసే ఆకళ్ళనీ చూసి - "ఫరవాలేదులేండి" అని మళ్ళీ బ్లిడ్జిలో పడ్డారు.

ముందువసారా, వెనకి పెద్దముడి, చెవలకు రవ్వల తమ్మెట్లు, చేతులకి రవ్వల వుంగరాలూ, కంఠె మెడచొక్కాకి రవ్వలబొత్తాములు. ఆ బంగారు పళ్లు చూస్తున్నకొద్దీ నాకు నవ్వు ఆగిందికాదు.

అతనిభార్య చంటిపిల్లకు పాలిస్తూ ప్రపంచంతో సంబంధం లేదన్నట్టు చూస్తోంది. వంటినిండా విలువైన రవ్వల నగలూ, ఖరీదైన జరీపట్టు చీరె. వంటినిండా రకరకాలైన బంగారునగలతో పిల్లలూ, యీసంసారాన్నంతా ఆసక్తితో పరికిస్తూ కూచున్నాను. తల్లి పక్కగా పన్నెండు, పదమూడేళ్ల పిల్ల ఎక్కడో కూచునివుంది. ఒళ్లో చంటిపిల్లతో అర్థం లేకుండా చూస్తోంది తల్లి. మొగపిల్లలిద్దరూ కిటికీలోంచి పరిగెత్తే చెట్లని చూస్తూ నిల్చున్నారు.

అమ్మ పక్కనున్న ఆవిడను వుద్దేశించి "ఎక్కడిదాకా" అని ప్రశ్నించింది.

అమ్మను చూస్తే బలే కోపం వచ్చింది. ప్రయాణాల్లో పక్కవాళ్లని పలకరించడం నాగరికతాలక్షణం కాదని అమ్మకి ఎన్ని సార్లు బోధించినా వొకటే.

"ఏ వూరు వెళ్తున్నారు"—అంది అమ్మ పక్కావిడిని వుద్దేశించి మళ్ళీని.

ఆవిడ నిద్దర్లోంచి మేలుకున్నట్టు వులిక్కిపడి అమ్మవంక చూసింది.

"తిరపతిదా -పోతుండాము."అన్నాడు తమలపాకులు, పచ్చివక్క నోట్లో వేసుకుని బంగారుపళ్లాయన.

తమలపాకులు బాగా నమిలి, సీట్లోంచి లేచి కిటికీవైపుకి వెళ్లి, కిటికీలోంచి తుపుక్కున వుమ్మాడు. ఆ సీట్లోనే పేపరు వెనక మొహం దాచుకున్నాయన మీద తుప్పర్లు పడ్డాయి, గాలి విసురుకు. పేపరు వెనక తలకాయ బయటకొచ్చింది. తీక్షణంగా చూసే ఆయన కళ్ళల్లోకి చూసి - చంటిపిల్లవాడిలా బంగారుపళ్ళన్నీ బయట పడేటట్టు పకపక నవ్వి:

"ఏమిటిదా చేసేది. తంబాగులేందిదా బండి నడవదు. కాతుదా అట్లావచ్చింది. చూసిగాలేదు—" అన్నాడు:

తలకాయ పేపరు వెనక్కి వెళ్లిపోయింది.

"కాతంటే ఏమిటే"అంది అమ్మ.

"కాతు - అంటే - గాలి అని అర్థం" అన్నాను.

"ఏమ్మా - పెరియమ్మా - మీరుదా ఎక్కడికి పూడుస్తరు. ఆపె మీ బిడ్డా" అన్నాడు అమ్మవైపు తిరిగి.

"అవును,నాయనా, కూతురూ అల్లుడూ తిరపతి మొక్కుకు వెళ్తున్నాం" అంది అమ్మ.

"వో - యింకేం. మనమంతా ఒకే తావుకి పూడుస్తము. ఓ యింటాపే, వింటివా ! వీరుదా మనతో తిరపతిదా వస్తూండిరి." అన్నాడు వుత్సాహంతో భార్యవైపు తిరిగి.

## జాతక చక్రము

మన దేశములో ప్రత్యేకముగా మన ఆంధ్రులలో మగపిల్లవాడు గాని, ఆడపిల్లగాని పుట్టిన వెంటనే ఆ పాపకు సరియయిన జాతకము వ్రాయించి వుంచుకొనుట మన సాంప్రదాయము. అట్టి జాతక చక్రములను శాస్త్రయుక్తముగా ఒక రూపాయి మణిఆర్డరుద్వారా పంపితే నేను వ్రాసి పంపించెదను. మణిఆర్డరు కూపన్‌లో పుట్టిన తేది, వూరు, టైము, అడ్రసు ఇస్తే చాలును.

కె. ప్రభాకర్,

2, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

ఆమె స్వప్నంలోంచి లేచినట్టు కళ్లు మావైపు తిప్పి, పరకాయించి మావంక చూసి, "అట్టనా - నల్లది. యీపెమీ బిడ్డా?"

"అవునమ్మా-"

"ఏం - అమ్మా- నీకుదా బిడ్డలులేవే!" అంది నావైపు తిరిగి.

నాకు నవ్వొచ్చింది. మా అమ్మతో ఎన్నిసార్లు చెప్పినా ప్రయాణాల్లో సోది మానదు.

మళ్ళీ ఆవిడ అమ్మవైపు తిరిగి "ఏం అమ్మా, మొక్కుకుంటేదా మంచిది. బిడ్డలు కలుగుతుంది. యీ బిడ్డకు నేనుదా మొక్కుగుంటిని." అంది పెద్దపిల్లని చూపి.

పెద్దపిల్ల తెల్లగా, పల్చగా వుంది:

"ఏంచదువుతున్నావ్" అన్నాను.

"థర్డ్ ఫారమ్" అంది వుత్సాహంగా.

"అద్దామ్మా - అందచదువు దామ్మా యింత దూరం తెచ్చింది. వద్దులే - అంద చదువు వద్దునేవద్దు అంటే - మాట చెవినిదా వేసుకోదు. ఎళించిపోయింది. చూస్తివా?" అంది నాపక్కకి తిరిగి.

"వంట్లో బాగాలేదా?" అన్నాను తిరిగి.

"వొంట్లోదా నిండా చీకు. ఆండ కూతురికి చదువుదా ఎందుకే - అని ఎంతమారమో చెప్పిచూస్తిని. అవరుదా యీ చదువుకు పెడ్తిరి," అంది భర్తవైపు తిరిగి.

"ఏంమ్మా - నీవుదా చెప్పు. యింద కాలంలో చదువుదా కావాలి. ఆండ బిడ్డలు బి. ఎ. పాసు చేసి వేస్తుండిరా. అందుకుదా నా బిడ్డిని స్కూలుకి పంపితిని. మా యింటాపెదా చదువు వద్దూ అంటుంది.' అన్నాడు నావైపు తిరిగి.

నా అభిప్రాయం కనుక్కోకుండానే భార్య అందుకొని "అమ్మా. యీపక్కదా వినుమీ. ఎట్టు మణికిదా పూడుస్తుంది. తిరింబి ఆరు మణికిదా వస్తుంది. కడుపుకుదా తినదే. కడుపుకి తినమని దుడ్డుదా యిస్తును; పలగారందా యిస్తును; తినదే - నీవు చెప్పమ్మా" అంది మళ్ళీ.

"బిడ్డకు చదువుమీదదా రొంబ ఆశ. మా యింటాపెదా వద్దనే వద్దు - చదువే వద్దని పిడివాదందా వేస్తుంది. బిడ్డదా స్కూలుకి పూడుస్తును అని గలాటా చేస్తుంది. నేనుదా ఏమి చేస్తును..." అన్నాడు:

"యీపెకు చదువుదా వద్దు. నల్ల పయ్యానిదా చూసి, కళ్యాణందా చేసి, కడుపుకి వేస్తేదా బాగ్గా అవుతుంది." అంది.

"నల్లపెయ్యకి యియ్యడం ఏమిటే?" అంది అమ్మ తెల్లపోయి.

"నల్లపెయ్యి కాదమ్మా. నల్ల పయ్యాకి అంటే మంచి కుర్రవాడని అర్థం" అన్నాను. ఈ మాటలు వింటున్న-బంగారు పళ్ళ ఆసామి "పెరియమ్మకుదా - నా తెలుంగు పట్టలేదు. మేముగూడా తెలుంగు, వారందామ్మా. మేముదా నెల్లూరునుంచి వస్తిమి" అన్నాడు అమ్మతో.

"మీరు తెలుగువారా?" అంది అమ్మ నమ్మలేనట్టు.

"అవునుదా అమ్మా. మా అప్పదా తెలుంగుదా రాస్తిరి. నీంగళ తెలుంగుదా నాకు పట్టదు." అన్నాడు నవ్వుతూ.

తిరువళ్లూరు వచ్చింది. పేపరు వెనక మనుషులు దిగిపోయారు.

"దామీ. రాండిమీ. కూచుకో" అని మావారిని కూచోబెట్టి, తలుపుదగ్గర నుల్చుని, కంపార్టుమెంటులోకి ఎవరినీ రాకుండా చేశాడు బంగారు పళ్ళాయన.

రైలు కదిలింది. పొన్నుపిళ్లై (మాకు తర్వాత చెప్పాడులెండి పేరు) భార్యవైపు తిరిగి, "ఆ బిడ్డలకు తినెందుకుదా వెయ్యిమీ" అన్నాడు.

ఆవిడ వంగి పలహారాల బుట్ట పైకి తీసింది. వడలూ, పెరుగూ అన్నం, కోవా బిళ్లలూ తీసి ఆకుల్లో పెట్టి పిల్లలందరికీ యిచ్చింది. పెద్దపిల్ల వద్దంది. నావంక తిరిగి "చూస్తివా - చూస్తివామ్మా ఆటదా చేస్తుంది. కడుపుకు తిననంటుందే. నా తల రాత. చూడుమీ ముట్టనే ముట్టదు. కోపం చేస్తినా గమ్మనుంటుంది. అంతదా. తినదమ్మా—" అంటూ నాకో ఆకు అందించపోయింది. నే వద్దన్నాను.

"వ్వో యింటాపె, నీకుదా తెలియదా. వారు అయ్యంగారుదానా. ఎట్ట తింటరూ. పళ్లు ఎత్తి యియ్యిమీ ఆ బిడ్డకు - ఆ పడుచువానికి యియ్యిమీ"—అన్నాడు పుక్కలించి నీళ్లు వుమ్మేస్తూ పిళ్లెగారు.

బత్తాయి పండ్లూ - అరటి పళ్ళూ యిచ్చిందావిడ. బత్తాయి పండు పెద్ద కూతురికి యివ్వబోతే వద్దంది.

"ఏమే పండుదా వద్దంటువే. నీకు ఏమిదా వచ్చింది. నీకు యిప్పుడుదా తెలియదే కష్టం. నీ తంబి చూడు. వాడుదా తింటాడే"— అమ్మాయి మాట్లాడకుండా కూచుంది.

. "ఈ పెకుదా రొంబ చీకయింది. ఎంతనో తొందర చేసింది. నాలుగు నాళ్లు— నాలుగు దినాలమ్మా-కంటికి తూకమే లేదు. అంత కష్టపడితిమి. ఇప్పుడుదా తినదు. ఆపెకు




1 తులము టిన్నులలో అన్ని చోట్ల దొరుకును.

శ్రీ అంబాళ్ అండు కంపెనీ,

తపాలు పెట్టె నెం. 8. మదరాసు.

నామీద కోపం. నేను స్కూలుదా వద్దని అంటిని. అందుకు రచ్చదా చేసింది. నీవుదా చెప్పమ్మా" అంది కన్నీళ్లు పెట్టుకుంటూ.

నాకు జాలేసింది.

"అప్పుడు దా సామికి దణ్ణం వేస్తిని. నిండు సొమ్ము - జుట్టు యిస్తామని దణ్ణం పెడ్తిని. ఆ సామి పైనించి అంతా దా చూస్తాడు. వాడు దావున్నాడు. బిడ్డ సౌఖ్యందా మనకు, దుడ్డు వద్దు, చదువు వద్దు."

అప్పుడర్థమయింది ఆ అమ్మాయి కోపం. పాపం థర్డ్ ఫారమ్ చదువుతోందా, ఇప్పుడు జుట్టు తీయిస్తే అవమానంగా వుండదూ? నగలిస్తే యివ్వరాదూ - తలనీలాలు కూడా ఎందుకో ఆ దేవుడికి!

రేణిగుంట వచ్చింది. అంతా దిగాం. "ఏం సామీ-యిక్కడ మా అయ్యవారుదా వున్నారు. వారి పీటికి దాపూడుస్తారండి మీ - రొంబ సౌకర్యమా వుంటుంది." అన్నాడు పిళ్లెగారు మా వార్ని బలవంతం చేస్తూ.

"అబ్బే, నా స్నేహితుడికి ముందే రాశాను వస్తానని. వాళ్ళు వంటా అవీ చేసుకునీ కూచునుంటారు"అన్నారు వారు.

"సరిదామ్మ, పెరియమ్మా, సామివద్ద కలుస్తాము. ఏమంటావు బిడ్డా" అన్నాడు నావంక తిరిగి.

వాళ్లు వెళ్ళిపోయాక మావారు "మళ్ళీ మనిషికనపడ్డాడా ఏంజేస్తానో నాకే తెలియదు"అన్నారు పళ్ళుకొరుకుతూ.

"మంచివాడు" అన్నాను.

* * *

"కాళ్లు ఎక్కడ దొరుకుతాయి? షో కేసుల్లో లేవేం?" అన్నారు ఆ సాయంత్రం దిగువతిరపతిలో తిరుగుతుంటే మావారు.

"కొండ ఎక్కేముందు కొంటాంలే, నాయనా"అంది అమ్మ.

మొర్నాడు పదిరూపాయలెట్టి, అమ్మ బంగారు కాలు కొంటూంటే, ఆయన వెలా తెలా పోవడం చూసి నాకు నవ్వాగింది కాదు.

నావైపు తిరిగి: "కాలంటే ఏపాతిక షుషైకేసులో వుంటుందనుకున్నా. దేవుడి దగ్గరకూడా సూక్ష్మంలో తేల్చేపద్ధతులున్నాయన్న మాట." అన్నారు వెక్కిరింపుగా.

అమ్మ ఆ మాటలు విని "బంగారు కాలంటే మనం యివ్వగలం అనుకో. మరి బీదా బిక్కీ మాటో? అందుకని ఆ ఏడుకొండలవాడే యీ ఏర్పాటుచేశాడు" అంది చిరునవ్వుతో.

వారు నావైపుతిరిగి "నాకు ముందుచెప్పలేదేం"అన్నారు.

"నన్ను ముందు అడిగారా?"

"అవును నీకుమల్లే తెరాలాడి రాలేదుగా నేను"అన్నారు రూక్షణంగా.

ఆతరవాత మా వారు పుసరుకో నేట్లో మునగనంటే, మునగనన్నారు. దేవుడి దర్శనానికి క్యూలో నుల్చోనన్నారు. అమ్మ స్పెషల్ అర్చన చేయించింది. అందువల్ల దేవుడి దర్శనం అయింది.

కొండ దిగినా మా ఆయనకి చిరుకోపం తగ్గలేదు. మధ్యాహ్నం భోజనం అయాక: "నాయనా నా కోర్కె తీర్చావు. యిన్నాళ్ళకి స్వామిదర్శనం అయింది. అమ్మాయి చేతి కిచ్చాను. మొన్న అదేదో సైకిలు కొనుక్కుంటానని అన్నావుటగా. ముందర అయిదు వందలు కట్టు. నేను పొలాల వూరెళ్లి మిగతా పైకం పంపుతాను" అంది అమ్మ.

వారి మొఖం విప్పారింది. తిరుగ ప్రయాణంలో పిళ్లెగారున్నా మావారికి అభ్యంతరం వుండక పోయింది! ★


ఫోనిక్సు పంకాలు

(A C & D C.)



సోల్ ఏజెంట్లు:
RM. S. & Co., Ltd., 16, Broadway, MADRAS-1.
విశాఖపట్టణం అండ్ తూర్పుగోదావరి జిల్లాలకు ఏజెంట్లు :-
మెస్సర్సు మాక్‌డవల్ అండ్ కంపెని లిమిటెడ్.
విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్ఠు, బొల్లి, సుఖ రోగోది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలు మందులు చూసి మోస పోకుడు
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.